క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో (1991–1992)లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 31 సంవత్సరాల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. సమ్మేళనంలో భాగంగా నాడు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం తాము చదివిన పాఠశాలకు రూ.50 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు సత్యనారాయణ, జంగన్న బురానోద్దీన్, అండాళమ్మ, వనజ, పూర్వ విద్యార్థులు అంజిరెడ్డి, సంపత్, శేఖర్,శంకర్, నరేందర్, విజయ్‌కుమార్, ధనలక్ష్మి, గీత, శ్రీలత, అనిత, శివలీల, జ్యోతి, యశోద, తదితరులు పాల్గొన్నారు.

నేడు సంస్మరణ సభ

జడ్చర్ల టౌన్: పౌరాణిక నాటక కళాకారుడు ముత్యాల వెంకటరత్నం నాయుడు సంస్మరణ సభ పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని ఆయన గృహం వద్ద నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ శివకుమార్ తెలియజేశారు. నవజ్యోతి కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించే సభకు నాటక కళాకారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

సదస్సుకు తరలిరండి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని చంద్రగార్డెన్‌లో సోమవారం ఉదయం షీటీం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అవోపా అధ్యక్షుడు మురళీ తెలియజేశారు. పట్టణంలోని మహిళలు, అమ్మాయిలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. వివిధ అంశాలపై సదస్సులో అవగాహన కల్పిస్తారన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘననివాళి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలపడంలో రాజీవ్‌గాంధీ పాత్ర ఎంతో ఉందని అన్నారు. నాయకులు సంజీవ్ ముదిరాజ్, హర్షవర్ధన్‌రెడ్డి, సీజే బెనహర్, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అడ్డాకుల: శాఖాపూర్ గ్రామానికి చెందిన అవుసుల బాలస్వామి అనారోగ్యంతో మరణించగా బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. బాలస్వామి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోద జయన్నగౌడ్, నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, యాదయ్య, నాగరాజు, వెంకట్రాములుగౌడ్, సతీష్‌గౌడ్, ఖలీల్ పాషా, రాజేష్‌సాగర్ తదితరులు ఉన్నారు.

మిడ్జిల్: రోడ్డు ప్రమాదంలో తమ స్నేహితుడు దీపక్ గాయపడడంతో విషయం తెలుసుకున్న పదోతరగతి(1997–1998) విద్యార్థులు ఆదివారం బోయిన్‌పల్లికి వెళ్లి అతడిని పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆస్పత్రి ఖర్చులకు మరింత సాయం అందజేస్తామని భరోసా కల్పించారు. శ్రీనివాస్, శంకర్, శ్రీను, శేఖర్, రామకృష్ణ, ఉప్పరి శ్రీను తదితరులు ఉన్నారు.

యువతి వివాహానికి..

బాలానగర్ : మండల కేంద్రానికి చెందిన చాకలి వెంకటయ్య కుమార్తె వివాహానికి వైస్ ఎంపీపీ వెంకటచారీ రూ. 5 వేలు ఆర్థికసాయం ప్రకటించగా, ఆదివారం పెళ్లి కూతురు ఇంటికి ఆయన తల్లి మాజీ ఎంపీపీ భాగ్యమ్మ వెళ్లి నూతన వస్త్రాలతోపాటు నగదును అందజేశారు. కార్యక్రమంలో రవికుమార్, రంగయ్య, రాములు, పద్మ తదిరతులు పాల్గొన్నారు.

పెద్ద ఆదిరాలకు ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు

జడ్చర్ల: మండల పరిధిలోని పెద్ద ఆదిరాల గ్రామానికి విద్యుత్ సరఫరాకు సంబంధించి ప్రత్యేక ఫీడర్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. సర్పంచ్ కృష్ణాబాయి ప్రారంభించారు. ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు వల్ల గ్రామంతో పాటు చిన్న ఆదిరాల తదితర చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కృషి మేరకు ప్రత్యేక ఫీడర్‌ను సాధించుకోగలిగామని వివరించారు. వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

తైక్వాండోను క్షేత్రస్థాయికి తీసుకెళ్తాం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలో తైక్వాండోను క్షేత్రస్థాయికి తీసుకెళ్తామని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు అన్నారు. పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కోచ్ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. సీనియర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నారాయణపేట రూరల్ : వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించిచారు. జాగృతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణ, లయన్స్‌క్లబ్ సభ్యులు ఆత్మారాం ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్లు ఉదయ్, హర్షిని, ఫైజా, నగేష్, ల్యాబ్ అసిస్టెంట్ రఘు, జాగృతి సభ్యుడు చిన్న, లయన్స్‌క్లబ్ కోషాధికారి రవికుమార్‌గౌడ్, పీఈటీ సాయినాథ్, డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- నిలిచిన విద్యుత్ సరఫరా


దాసర్‌పల్లి వద్ద రెండుగా చీలిపోయిన చెట్టు


మూసాపేట మండలం దాసర్‌పల్లి రోడ్డుపై పడిపోయిన చెట్టు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని దాసర్‌పల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి వేముల నుంచి దాసర్‌పల్లి వెళ్లే బీటీరోడ్డుపై చెట్టు నేలకూలింది. రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టును గ్రామస్తులు ట్రాక్టర్ సాయంతో తొలగించారు. అదేవిధంగా దాసర్‌పల్లి పోషమ్మ దేవాలయం వద్ద వందేళ్ల చరిత్ర ఉన్న వేప చెట్టు రెండుగా చీలిపోయింది. గ్రామంలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అదేవిధంగా అడ్డాకుల మండలం కందూర్ దేవాలయం వద్ద ఈదురు గాలులకు పెళ్లి బృందం వచ్చిన డీసీఎం కరెంటు స్తంభానికి తగిలింది. దీంతో స్తంభం ఒకవైపు ఒరిగిపోయింది. స్తంభం నేలకూలినా...పెళ్లికి వచ్చిన వారు వాహనంలో ఉన్నా పెద్ద ప్రమాదం సంభవించేది. మామిడి తోటల్లో పండ్లు నేలరాలాయి. ఇదిలా ఉండగా మూసాపేట మండలంలో సాయంత్రం నాలుగు గంటల నుంచి కరెంటు సరఫరా నిలిచిపోయింది. రాత్రి 9 గంటల వరకు కూడా కరెంటు రాలేదు.

చిన్నచింతకుంట : మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో పాటు వర్షం కురిసి బీభత్సం సృష్టించింది. దీంతో ఏదులాపురం, ముచ్చింతల గ్రామాల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు రోడ్లపై, ఇండ్లపై పడ్డాయి. గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. అదేవిధంగా గ్రామాలకు విద్యుత్ సరఫరా సైతం నిలిపోవడంతో అవస్థలు పడ్డారు.


ఏదులాపురంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం


ముచ్చింతలలో..

వడ్లు కొనుగోలు చేయాలని రాస్తారోకో

మిడ్జిల్: రోజుల తరబడి అకాల వర్షాలకు వడ్లు తడిసి నష్టం కలుగుతోందని, వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని రాణిపేట్ రైతులు గ్రామంలోని జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. హమాలీ కొరత చూపించి ఆలస్యం చేస్తున్నారని, దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ చేరుకొని అధికారులతో మాట్లాడారు. త్వరలో సమస్య పరిష్కారం అవుతుందని రైతులకు సర్దిచెప్పారు. దీంతో వారు రాస్తారోకో విరమించారు. కాగా అంతకుముందు


ధర్నాలో పాల్గొన్న రైతులు, నాయకులు

రైతుల రాస్తారోకోకు బీజేపీ మండల అధ్యక్షుడు లాలు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తిరుపతి మద్దతు తెలిపారు.

హజ్‌యాత్ర అవకాశం అదృష్టం



అవగాహన కల్పిస్తున్న మౌలానా రశీద్ నసీం నద్వి

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర హజ్‌యాత్ర చేయడానికి అవకాశం రావడం ఎంతో అదృష్టమని హైదరాబాద్‌కు చెందిన ధార్మికవేత్త మౌలానా రశీద్ నసీం నద్వి అన్నారు. జిల్లా హజ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం యాత్రీకులకు నాల్గో విడత శిక్షణ శిబిరం నిర్వహించారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ మహమూద్‌అలీ, మహ్మద్ మేరాజుద్దీన్, చీఫ్ ప్యాట్రన్ రవూఫ్, ఎం.ఎ.సత్తార్, రజాక్, ఖాజా నిజాముద్దీన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బెల్టు గ్రేడింగ్ పరీక్షలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మాడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం శ్రీ హనుమాన్ కరాటే, యోగా అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. సీపీఐ పట్టణ ఉపాధ్యక్షుడు కె.నర్సిములు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బెల్టులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. సురేష్‌కుమార్, బుచ్చన్న, ప్రతాప్, శ్రీనివాసులు, సాంబశివుడు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.


బెల్టులు సాధించిన విద్యార్థులతో నర్సిములు

పిడుగుపాటుకు గేదె మృతి

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్ శివారులో పిడుగుపాటుకు గుర్రై గేదె మృతిచెందింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. వార్డు సభ్యుడు దోనూరు చంద్రారెడ్డి తన గేదెను పొలం వద్ద చెట్టుకు కట్టేశాడు. కాగా ఆదివారం సాయంత్రం అకాల వర్షం కురిసిన సమయంలో పిడుగుపాటుకు గుర్రై చెట్టు వద్దే గేదె మృతిచెందింది. దీంతో చంద్రారెడ్డికి సుమారు రూ. 60 వేలు నష్టం వాటిల్లిందని గ్రామస్తులు పేర్కొన్నారు.

చిట్టెబోయిన్‌పల్లిలో 2 ఆవులు..

జడ్చర్ల టౌన్: మండలంలోని చిట్టెబోయిన్‌పల్లితండాకు చెందిన జగన్ నాయక్‌కు చెందిన ఆవులు ఆదివారం సాయంత్రం 4గంటల సమయంలో పిడుగుపాటుకు గుర్రై మృత్యువాత పడ్డాయి. జగన్ తన పొలంలో ఆవులను కట్టి ఉంచిన సమయంలో ఘటన చోటుచేసుకుంది. దీంతో బాధితుడిని సర్పంచ్ భారతి పరామర్శించారు. ఘటన గురించి అధికారులకు సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: రెండు కార్లు ఢీ కొన్న ఘటనిది. స్థానికుల వివరాల ప్రకారం...హైదరాబాద్‌కు చెందిన రెండు వేర్వేరు కుటుంబాలు రెండు కార్లలో కర్నూల్ వైపు జాతీయ రహదారిపై వెళ్తున్నాయి. కాగా జానంపేట పాత పెట్రోల్ పంపు సమీపంలోని యూటర్న్ వద్ద ఒక వాహనం యూటర్న్ తీసుకునేందుకు రోడ్డుపై ఆగింది. దీంతో వెనుక ఉన్న కారుకు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆ కారు వెనుక ఉన్న మరో కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రెండు కార్లు దెబ్బతిన్నాయి. ముందు కారులో వెనుక సీట్లో కూర్చున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. టోల్‌ప్లాజా సిబ్బంది రెండు కార్లను ఘటనా స్థలం నుంచి ఠాణాకు తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ విజయ భాస్కర్ తెలిపారు.

వీఓఏల శ్రమను దోచుకుంటున్నారు



మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహిళా సంఘాలకు గ్రామాల్లో సముచిత సేవలు అందిస్తున్న వీఓఏల శ్రమను ప్రభుత్వం దోచుకుంటోందని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఆరోపించారు. తెలంగాణ ఐకేపీ వీఓఏల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె 35వ రోజుకు చేరిన సందర్భంగా మాట్లాడారు. వీఓఏలు చెవిలో పూలు పెట్టుకొని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న నిర్వహిస్తున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంలో వీఓఏలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భీమయ్య, వెంకటయ్య, ధర్మానాయక్, ఆంజనేయులు, జయమ్మ, భార్గవి, సంధ్య పాల్గొన్నారు.

28న ఆత్మీయ సమ్మేళనం



అడ్డాకుల: బీఆర్‌ఎస్ మండల ఆత్మీయ సమ్మేళనాన్ని ఈనెల 28న కందూర్ స్టేజీ సమీపంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సన్నాహక సమావేశం ఆదివారం అడ్డాకులలో ఎంపీటీసీ రంగన్నగౌడ్ ఇంటి వద్ద నిర్వహించారు. అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్ తదితరులు ఉన్నారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నీరుగార్చారు


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం నీరుగార్చిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేసిన అవగాహన లేని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నమన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.38వేల కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చారని, కానీ రీడిజైన్ పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. 2015లో భూమిపూజ చేసినప్పుడు మూడేళ్లలో పూర్తిచేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు. ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి జాప్యానికి కారణమవుతున్నారని లక్ష్మారెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని, సదరు నాయకులు బీఆర్‌ఎస్‌లో ఉన్న సంగతి మరిచిపోవద్దని అన్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేల అసమర్థత వల్లే ఆలస్యం...

బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల అసమర్థత వల్లే ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమవుతోందని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టు కోసం కొనుగోలు చేస్తున్న మోటార్లు, పైపులకు అధిక ధరలు వేస్తుండడం వల్ల జరుగుతున్న అవినీతి గురించి నాగం జనార్దన్‌రెడ్డి కేసు వేశారని, ప్రాజెక్టు ఆపాలని కాదని గుర్తుచేశారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి విషయంలో బహిరంగ చర్చకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు.. సమావేశంలో నాయకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, నాయకులు లక్ష్మణ్‌యాదవ్, సిరాజ్ ఖాద్రీ, అజ్మత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్‌లో సత్తాచాటాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా క్రీడాకారులు కిక్ బాక్సింగ్ సత్తా చాటాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్ అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో కింగ్ షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలోని శిక్షణా శిబిరంలో ఆదివారం విద్యార్థులకు శిక్షణ అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శివరాజ్ మాట్లాడారు. జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో 25 ఏళ్లుగా శిబిరం నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. రవినాయక్, 43వ వార్డు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శరత్‌బాబు, కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ చైర్మన్ లక్ష్మణ్, వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, టీఎస్‌టీయూ అసోసియేట్ అధ్యక్షుడు హమీద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ....

బాలానగర్: ఏడుగుట్టల తండాకు చెందిన జేదేనియా నాయక్‌కు(రూ.32వేలు) ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరు కాగా సర్పంచ్ రాంజినాయక్, మాజీ డైరెక్టర్ శివానంద రెడ్డి ఆదివారం బాధిత కుటుంబానికి అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన చంద్రుడు గౌడ్(రూ.48 వేలు)కు వైస్ ఎంపీపీ ఆధ్వర్యంలో చెక్కును అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, యాదిగిరి గౌడ్ తదితరులు ఉన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు...

బాలానగర్: రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు రైతు అగ్రోసేవా కేంద్రం ద్వారా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అందుకు పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డుల జిరాక్స్ సమర్పించాలని కోరారు.

తలసేమియా బాధితులకు అండగా నిలుద్దాం

రాజాపూర్: తలసేమియా బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు రక్తదానం చేసి వారికి అండగా నిలవాలని రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లాలో172 మంది తలసేమియా బాధితులు ఉన్నారని వారికి తరచూ రక్త అవసరముంటుందని పేర్కొన్నారు. వారికి సకాలంలో రక్తం అందించకపోతే ప్రాణాలకు ముప్పు కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా భావించి రక్తదానం చేయాలన్నారు. శిబిరంలో 76 యూనిట్ల రక్తం సేకరించినట్లు వివరించారు. ఎస్‌ఐ వెంకట్‌రెడ్డిని సన్మానించారు. అనంతరం గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో హైజనిక్‌కిట్‌లను ఉచితంగా పంపిణీ చేశారు.


రక్తదానం చేస్తున్న పోలీసులు, నాయకులు

మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పెరిబచ్చిరెడ్డి, ఎంపీపీ సుశీల, ఏఎంసీ డైరెక్టర్ కిష్టారం మల్లేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ముడా డైరెక్టర్ శ్రీశైలంయాదవ్ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులాలన్నింటికీ ఒకే భరోసా ఇవ్వాలి


మాట్లాడుతున్న విజయ్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్: తెలంగాణలో బీసీ అణగారిన కులాలు వందకు పైగా ఉన్నాయని, అలాంటి కులాలన్నింటికీ ఆర్థికసాయం అందజేయాలని బీసీ మేధావుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రభాకర్ కోరారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వం బీసీ కులాల్లో కుల వృత్తి వారికి మాత్రమే ఆర్థికసాయం చేసి మిగతా కులాల వారికి ఇవ్వమనేది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని కుల సంఘాల ప్రతినిధులతో భేటీ అయి వారి సమస్యలను తెలుసుకొని, దృష్టికి వచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక వనరులు చేకూర్చే బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ఇప్పటికీ అసెంబ్లీ, పార్లమెంట్ మెట్లు ఎక్కని కులాలు వందకు పైగానే ఉన్నాయన్నారు. వారికి అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేసే అవకాశం కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బీసీ కులాలకు ఒక భరోసా ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బీసీలు అంటే ఓట్లు వేసే యంత్రాలు కాదని, వారిని ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ ఆదుకోవాలని బీసీ నాయకుడు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు రవికుమార్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనంలో జిల్లా కవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో ఆదివారం అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన కవులు నందిగామ కిషోర్, ఎంఎస్.విజయ్‌కుమార్, బసవరాజప్ప పాల్గొని కవితాగానం చేశారు. నిర్వాహకులు సన్మానించారు.



జీఓ 69 అమలు చేయాలి

నారాయణపేట రూరల్ : జిల్లా ప్రజలకు తాగు నీరు, రైతులకు సాగునీరు అందించేందుకు జీఓ 69ని అమలు చేయాలని జల సాధన సమితి కన్వీనర్ కెంచె శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. నాడు ఉమ్మడి రాష్ట్రంలో గవర్నర్ పాలనలో ఇచ్చిన జీఓను బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొక్కి పెట్టిందని, పాలమూర్ – రంగారెడ్డి ఎత్తిపోతలను తెరమీదకు తెచ్చి జిల్లా ప్రజలను మోసం చేస్తోందన్నారు. మిగులు జలాలతో లాభం చేకూర్చకుండా వరద జలాలపై ఆధారపడితే నీరురాక రాక రైతుల ఆత్మహత్యలు, వలసలు పెరుగుతాయన్నారు. 23న స్వామి వివేకానంద మున్సిపల్ పార్క్ వద్ద జరిగే నిరసన దీక్షకు రైతులు, మేధావులు, విద్యార్థులు తరలిరావాలని కోరారు.

శివారు రోడ్లపై చిన్నచూపేలా..!

- రాకపోకలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని నిజాలాపూర్ నుంచి మహ్మదుస్సేన్‌పల్లి రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాకాలంలో మహ్మదుస్సేన్‌పల్లి గ్రామస్తులు రోడ్డుపై నడిచి వెళ్లడానికి కూడా వీలు లేని విధంగా మారుతోంది. మట్టి రోడ్డుపై వర్షం నీళ్లు నిలిచి రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. సుమారు 3 కిలోమీటర్లున్న రోడ్డుపై అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల మంత్రి నిరంజన్‌రెడ్డి కేటాయించిన నిధులతో గుంతలను పూడ్చి వేసి చదును చేశారు. కానీ వర్షాకాలం వస్తే పరిస్థితి మొదటి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. మహ్మదుస్సేన్‌పల్లిని 2016లో కొత్తగా ఏర్పడిన మూసాపేట మండలంలో చేర్చారు. దీనివల్ల మండల కార్యాలయాల్లో పనులతో పాటు మంగళవారం మూసాపేటలో జరిగే వారాంతపు కూరగాయల సంతకు గ్రామస్తులు నిజాలాపూర్ మీదుగా మూసాపేటకు వస్తుంటారు. కాగా నిజాలాపూర్ వరకు ఉన్న మట్టి రోడ్డు దెబ్బతినడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మహ్మదుస్సేన్‌పల్లి వనపర్తి నియోజకవర్గంలోని గ్రామమైనా ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో ఉంది. అయితే నిజాలాపూర్, మహ్మదుస్సేన్‌పల్లి రోడ్డు రెండు నియోజకవర్గాల శివారులో ఉండటంతో ఈ రోడ్డు గురించి నేతలు పెద్దగా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇటు దేవరకద్ర, అటు వనపర్తి నియోజకవర్గం మధ్యన ఉన్న రోడ్డు కావడంతో


అధ్వానంగా నిజాలాపూర్-మహ్మదుస్సేన్‌పల్లి రోడ్డు (ఫైల్)

అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాగు చేయించాలని పాలకులను కోరుతున్నారు. బీటీరోడ్డు వేయించడానికి నిధులు మంజూరు కావడంలో జాప్యం జరుగుతోందని అంటున్నారు. మరో పక్షం రోజుల్లో వర్షాకాలం మొదలు కానున్న నేపథ్యంలో రోడ్డు కష్టాలు మళ్లీ మొదటి కొస్తాయని గ్రామస్తులు వాపోతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు రోజు సైకిళ్లపై నిజాలాపూర్ జెడ్పీ హైస్కూల్ వెళ్లేందుకు సమస్యలు తప్పవని అంటున్నారు. ఇప్పటికైనా నేతలు స్పందించి బీటీ రోడ్డుగా మార్చాలని కోరుతున్నారు.



ప్రతిపాదనలు పంపించాం..

మహ్మదుస్సేన్‌పల్లి–నిజాలాపూర్ రోడ్డును బీటీగా మార్చేందుకు నిధుల కోసం ఇంతకు ముందు రెండు సార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇటీవల మూడోసారి మళ్లీ ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాం. త్వరలోనే బీటీ రోడ్డు కోసం నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.



–లక్ష్మణ్‌గౌడ్, పీఆర్ ఏఈ, మూసాపేట